ప్రజాశక్తి
శుక్రవారం 1 సెప్టెంబర్ 2023
శ్రీ సత్యసాయి



వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో భూపోరాటం



భూమిని చదును చేసుకుంటున్న పేదలు

4వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో దుక్కి దున్ని విత్తనం వేసిన వ్యవసాయ కూలీలు

అడ్డగించిన టింబక్టివ్ ట్రస్టు సభ్యులు

ప్రతిఘటించిన పేదలు, నాయకులు



మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివి. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రొద్దం

శ్రీ సత్య సాయి జిల్లా రొద్దం మండలం కొగిర రెవిన్యూ గ్రామంలోని 4 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని 4 గ్రామాలకు చెందిన వందలాది మంది పేదలు వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో దుక్కిదున్ని విత్తనం వేశారు. ఈ చర్యలను ఇదివరకే భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్న టింబక్టివ్ ట్రస్టుకు చెందిన వారు గుండాల సాయంతో అడ్డుకున్నారు. అయితే పేదలు, నాయకులు ప్రతిఘటించడంతో వారు వెనుతిరిగారు.

మండలంలోని కొగిర రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 666 – 669లోని 4వేల 4వేల ప్రభుత్వ భూమిలో భూమిలేని నిరుపేదలు సాగు చేసుకుంటున్నారు. పేదలకు పట్టాలిస్తామని చెప్పి ఇచ్చిన హామీని అమలు చేయకుండా ఈ భూమిని బడాబాబులకు అప్పజెప్పడానికి అధికారులు కుట్రపన్నారు. టింబక్ట్ ట్రస్ట్ పేరుతో బడా నాయకులు పేదలను భూముల నుండి తరలించి అక్రమంగా అడవిలో ఉన్న అడవి సంపదను అక్రమంగా దోచుకోవటానికి కుట్ర పన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన పేదలు వ్యకాసం ఆధ్వర్యంలో భూపోరాటం చేయడానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన పేదలు వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వి. వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ నేతృత్వంలో వ్యకాసం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎర్ర జెండాలు చేత పట్టి భూమిలోకి ప్రవేశించి ట్రాక్టర్లతో దుక్కి దున్ని విత్తనాలు వేశారు. భూమి కోల్పోయిన నాలుగు గ్రామాల పేదలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమిలోకి ప్రవేశిస్తుంటే ట్రస్ట్ పేరుతో ఉన్న కొందరు గుండాలను వెంటబెట్టుకుని మారణాయుధాలతో పేదలపై దాడికి పూనుకున్నారు. అప్పటికే ఆవేశంతో ఉన్న పేదలు ఎర్రజెండాలు ధరించిన కర్రలతో ప్రతిఘటించారు. తాము వెంట తెచ్చుకున్న దురదగుంట ఆకుతో మద్యం తాగి దాడికి వచ్చిన గుండాల శరీరాలకు రుద్దారు. దీంతో ఆ దురదను భరించలేక గూండాలు వెనక్కు తగ్గారు. అదే ఊపుతో ఉన్న పేదలు భూమి లోకి ప్రవేశించి దున్ని , విత్తనాలు చల్లారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇది ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇక్కడి పేదలు రెండు తరాల నుండి ఈ భూమిలో సాగు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టాలిస్తామని చెప్పి ఇవ్వకుండా ఈ భూమిని బడా నాయకులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ఈ భూమిలో పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ నిత్యం దళిత , గిరిజనుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం ప్రస్తుత భూ పంపిణీలో సాగుదారులకు న్యాయం చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్ , పెద్దన్న మాట్లాడుతూ సాగులో ఉన్న పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ , జిల్లా కమిటీ సభ్యులు నారాయణ , వెంకట్ రాముడు , కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ , సాగుదారులు జయమ్మ , అనిత , రామాంజనమ్మ మారుతి , నారాయణ , ఓబమ్మ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్‌తో దుక్కిదున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్నసిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి. నాగేశ్వరరావు

తాగునీటి పథకం కార్మికులను రోడ్డున పడేసిన ప్రభుత్వం

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి. నాగేశ్వరరావు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి నీటి సరఫరా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం రోడ్డున పడేసిందని, కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని నీటి సరఫరా పంపు హౌస్ వద్ద కార్మికుల సమ్మె బుధవారం ఏడవ రోజు కొనసాగింది. వీరి ఆందోళనకు మద్దతుగా నాగేశ్వరరావు తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, మున్సిపల్ కార్మికుల జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఐదు నెలల వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వకుంటే కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విధి లేని పరిస్థితులలో కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెకు ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఆ పథకంలో పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇతర పథకాలకు కోట్లాది రూపాయలు బటన్ నొక్కి ఇస్తున్నారని, కాలే కడుపుల కార్మికులకు ఎందుకు నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. 572 మంది కార్మికులు దాదాపు వెయ్యి గ్రామాలకు తాగునీరు అందిస్తూ పని చేస్తుంటే ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం దారుణానికి పాల్పడుతోందని విమర్శించారు. కార్మికులు న్యాయం చేయలేని పాలకులు, అధికారులు ఆందోళన చేస్తున్న కార్మికులను, నాయకులను పోలీసులు చేత అరెస్టు చేయిస్తున్నారన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. ఇఎస్ వెంకటేష్, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందని విమర్శించారు. ఈ పథకానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మధుసూదన్, నరేష్, ఓబులేష్, ఈశ్వరయ్య, బాబు, శంకర్, ప్రభు, నాగేంద్ర రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా ఓటరు నమోదు

బత్తలపల్లి : ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మండల స్పెషల్ ఆఫీసర్(డిఎస్ఒ) వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బిఎల్ఒలు నిర్వహించిన సర్వేను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర వాటిని నిశితంగా పరిశీలించి వీటిపై రికార్డు నిర్వహించాలని బిఎల్ఒలను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఎల్ఒలు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకూ తొలగించిన ఓటర్ల జాబితాను పరిశీలించినట్లు తెలిపారు. బిఎల్ఒలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరబాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఏస్థాయిలో అభ్యంతరాలు ఉన్నా తిరిగి విచారణ చేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ యుగేశ్వరీదేవి, ప్రతాప్, తదితరులు ఉన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

నల్లబ్యాడ్జీలతో డాక్యుమెంట్ రైటర్ల నిరసన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం డాక్యుమెంటు రైటర్ల సంక్షేమంపై దృష్టి సారించకుండా కార్డ్ ప్రైమ్ 2.0ను ప్రవేశపెట్టడం బాధాకరమని ధర్మవరం డాక్యుమెంటు రైటర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్డ్ ప్రైమ్ 2.0ను నిరసిస్తూ రెండవ రోజైన గురువారం పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకపోగా తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తే సామాన్యులు మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. డాక్యుమెంటు రైటర్ల లైసెన్సును పునరుద్ధరించి, అందుకు తగిన రుసుము నిర్ణయించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, బాలాజీ, మహేంద్ర, గోపి, భాస్కర్, నాగార్జున, జావీద్, వెంకటేశ్, ధను, యస్వంత్, అనిల్, నూర్, తేజ, కార్తీక్ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే : ఆర్‌డిఒ


ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న భూ రక్ష' పథకంలో భాగంగా భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డిఒ భాగ్యరేఖ సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి శ్రీనివాస కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒతో పాటు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి రామకృష్ణ, డిఐలు శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, రీ సర్వే తహశీల్దార్ క్రాంతికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ, మండల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు రీసర్వేపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ మాట్లాడుతూ జగనన్న భూ రక్ష పథకంలో సరిహద్దు రాళ్లను వేసే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, రైతులు, అధికారులకు మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా సర్వే నిర్వహిస్తున్నామని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీ సర్వేలో అధికారులకు రైతులు సహకరించాలని, తద్వారా రీసర్వే సునాయసంగా జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పుట్టపర్తి డివిజన్‌లోని తహశీల్దార్లు, రీ సర్వే డిటిలు, మండల డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్‌ఐలు, విలేజ్ సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, పుట్టపర్తి తహశీల్దార్ కరణం నవీన్‌కుమార్, సిఎస్‌డిటి షబ్నం, తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనపై సమరభేరి పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న నిరంకుశ పాలనపై గురువారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద 'సమరభేరి' పోస్టర్‌ను విడుదల చేసినట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, మండల నాయకులు వివి రమణ, శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంట గ్యాస్ ధర తగ్గించాలని, నల్లధనం వెలికితీయాలని, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేయాలని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పించాలని, రైతుల సమస్యలు, విద్యుత్ కోతలు, నిత్యావసర సరుకుల ధరలు, తదితర సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి సాగిస్తున్నామన్నారు. ఆయా సమస్యలు పరిష్కారం కాకపోతే రాబోయే రోజుల్లో ప్రజలందరినీ ఏకం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుళ్లాయప్ప, కార్మిక సంఘం నాయకులు సుధాకర్, రామాంజి, వేణు, రమేష్, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వాడీవేడిగా 'పురం' కౌన్సిల్ మీట్

నిధుల కేటాయింపుకాదు... అభివృద్ధి ఎక్కడ..?

చైర్‌పర్సన్‌ను, కమిషనర్‌ను నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ప్రతి సారి జరిగే కౌన్సిల్ సమావేశంలో వార్డుల అభివృద్ధికోసం నిధులు కేటాయిస్తున్నారు, అయితే అభివృద్ధి ఎక్కడ జరగడం లేదని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ను నిలదీశారు.

గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 21 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఇటీవల వృతి చెందిన మున్సిపల్ ఎంఈ ఈశ్వరయ్య మృతికి నివాళులు అర్పించారు. అనంతరం అజెండాపై చర్చను ప్రారంభించాలని ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. దీంతో పలువురు కౌన్సిలర్లు తమ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 25వ వార్డులో రూ.5.10లక్షల నిధులతో అభివృద్ధి చేశామని నిధులు సైతం డ్రా చేశారని, ఆ నిధులతో ఏమి అభివృద్ధి చేశారో చూపించాలని వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్‌ను నిలదీశారు. రెండున్నర ఏళ్లుగా వార్డుల్లో కనీస అభివృద్ధి సైతం చేపట్ట లేదని...వార్డు పర్యటనకు వెళితే ప్రజలు నిలదీస్తున్నారని అభివృద్ధి చేయక పోతే ఇక వార్డుల్లో అడుగు పెట్టే పరిస్థితి లేదని పలువురు కౌన్సిలర్లు అన్నారు. ప్రతి పక్ష కౌన్సిల్ నేత రమేష్ కుమార్ మాట్లాడుతూ మహిళా కౌన్సిలర్ భారతీ తన వార్డులో అభివృద్ధి జరగలేదని ఇప్పటికి చాలాసార్లు సభ దృష్టికి తీసుకొచ్చిన స్పందించలేదన్నారు. దీంతో ఆమె కళ్లకు, నోటికి నల్ల రిబ్బను కట్టుకుని సభకు వచ్చిన దానిపై ఎవరు మాట్లాడక పోవడంపై దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ వార్డులో ఏమి అభివృద్ధి కావాలో నివేదికను ఇవ్వకుండా ఇలా నిరసన చేయడం తగదని సూచించారు. దీంతో ఒక్క సారిగ ప్రతి పక్ష కౌన్సిలర్లు అందరు లేసి తమ వార్డుల్లో ఇప్పటికి ఏ అభివృద్ధి జరగలేదని, దీంతో వార్డుల్లో తిరగలేక పోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో అధికార, ప్రతి పక్ష కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇది జరుగుతుండగానే కౌన్సిలర్ రాఘవేంద్ర ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి టిడిపి ప్రాతినిత్యం వహిస్తున్న వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఛైర్ పర్సన్ ఎంత చెప్పిన వారు వినలేదు. చివరకు వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధినికోరుకునే వారు ఇలా సభను అడ్డుకోవడం తగదని, ఎదైనా ఉంటే చర్చించాలని వారికి సూచించారు. దీంతో సభ ప్రారంభం అయింది. కౌన్సిలర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధీనంలో ఉన్నా ప్రవేటు బస్టాండ్ నమ్ముకుని 100 నుంచి 150 మంది వరకు పేద ప్రజలు ఆధారపడి జీవనం చేస్తున్నారని అయితే కూరగాయల హోల్‌సేల్ వ్యాపారులు వారికి కేటాయించిన స్థలంతో పాటు మొత్తం బస్టాండ్ ఆక్రమించుకుంటున్నారని, దీంతో బస్టాండును నమ్ముకుని వ్యాపారం చేసుకుంటున్న పేదలు రోడ్డున పడుతున్నారని, వారిని మానవత్వంతో ఆదుకోవాలని కోరారు. ఇలా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అవినీతి రాజ్యమేలుతుందని, ప్రతి పనికి మామూళ్లు దండుకుంటున్నారని, లిఖిత పూర్వకంగా అధికార పార్టీ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. సమావేశం వాడి వేడిగ జరిగినప్పటికి అజెండాలోని అన్ని అంశాలను అమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



వాగ్వాదానికి దిగిన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్ : జెసి చేతన్

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఓటరు వెరిఫికేషన్‌ను బిఎల్ఒల ద్వారా పకడ్బందీగా చేపట్టాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జాయింట్ కలెక్టర్ చేతన్ తహశీల్దార్ నాగరాజును ఆదేశించారు. జెసి గురువారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పి హెచ్‌ఎస్, ఉర్దూ పాఠశాల, సోమఘట్ట జడ్పి హెచ్‌ఎస్, చాగలేరు ఎంపియుపి పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ఓటరు రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ నియమాలకు లోబడి ఉంచుకోవాలని సూచించారు. ఓటరు వెరిఫికేషన్‌లో భాగంగా వచ్చిన ఫారం–6, 7, 8లను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన కేంద్రాలను సిద్ధం చేసుకొని రేషనలైజేషన్ ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బిఎల్ఒలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చాగలేరు ఎంపియుపి పాఠశాలలో జెసి చేతన్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి అక్కడే భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఓటరు పరిశీలన నిష్పక్షపాతంగా జరగాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఓటరు జాబితా తయారీ నిష్పక్షపాతంగా జరగాలని, అలా కాకుండా అధికార పార్టీ నేతల మాటలు విని ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తే అధికారులపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ హెచ్చరించారు. ఆయన గురువారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయం విలేకరుల సమావేశంలో వైసిపి ప్రభుత్వం, నేతలపై విరుచుకుపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా రూ. 1500 నుంచి రూ. 2 వేల కోట్ల ఇసుకను తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నదులన్నీ పూర్తిగా ధ్వంసం చేస్తున్నారన్నా రు. టిడిపి హయాంలో ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించారన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ట్రాక్టర్ ఇసుకకు రూ.7వేలు వసూలు చేసున్నారన్నారు. వారికి సహకరిస్తున్న అధికారులు భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. జాతీయ రహదారి పనుల్లో రాయల్టీ రూపంలో దోపిడీ చేసున్నారన్నారు. నియోజకవర్గంలో ఇళ్లు, స్థలం అమ్మాలన్నా, కొనాలన్నా ఎమ్మెల్యేకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో ఓటు అడగడానికి వస్తే ప్రజలు మీ బట్టలు ఊడదీసి తరమితరిమి కొట్టే పరిస్థితి వస్తుందన్నారు. నియోజకవర్గంలో 17,110 దొంగ ఓట్లు ఉన్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, మరో నాయకుడు 13 వేల దొంగ ఓట్లు ఉన్నాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆర్‌డిఒ తిప్పేనాయక్ ఎమ్మెల్యేకి అనుకూలంగా పని చేస్తున్నారని, ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి జరగకపోగా దౌర్జన్యాలు, దందాలు ఎక్కువయ్యాయని ఆయన మండిపడ్డారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

కొనసాగిన 'సత్యసాయి' కార్మికుల సమ్మె


ముదిగుబ్బలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

సమ్మెలో భాగంగా ఏడో రోజు సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు స్థానిక పంప్ హౌస్ ఎదుట మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వేతనాలందక కుటుంబ పోషణ భారమైందని వాపోయారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరికి టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్, ప్రకాష్‌నాయుడు, తదితరులు మద్దతు తెలిపారు. సమ్మెలో కార్మికులు చంద్ర, సూర్యనారాయణ, గోపాల్, ధర్మ, నారాయణ స్వామి, మల్లయ్య, రమేష్, రాజగోపాల్‌రెడ్డి, రాజశేఖ ర్‌రెడ్డి, ముత్యాలప్ప, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ గురువారం సత్యసాయి నీటి విభాగం కార్మికులు పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం పంప్ హౌస్ వద్ద ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు కష్టపడుతున్న తమ సంక్షేమం గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రతినెలా సక్రమంగా జీతం అందేలా చూడాలన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని వార్డుల్లో సమస్యలను పరిష్కరించి మా గౌరవాన్ని కాపాడాలని, ప్రతి సమావేశంలో సమస్యలను వినడమే కానీ పరిష్కారం మాత్రం చూపలేదని పలువురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ, కమిషనర్ బండి శేషన్న దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక మున్సిపల్ సమావేశ హాలులో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పురుషోత్తంరెడ్డి, మేడాపురం వెంకటేశ్, తదితరులు వారి వారి వార్డుల్లో నెలకొన్న సమస్యలపై గళం విప్పారు. ప్రధానంగా పందుల బెడద, వీధి దీపాలు, ఫాగింగ్ తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే కొన్ని వార్డుల్లో తాగునీటి సమస్య ఉందని తెలుపగా విద్యుత్ కోతల వల్ల తాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు జయరామిరెడ్డి, షేక్ షంషాద్ బేగం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కదిరి మున్సిపల్ సమావేశం రసాభాస

ప్రజాశక్తి-కదిరి టౌన్

మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీ సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కదిరి మున్సిపల్ సమావేశం రసాభాసగా సాగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ గౌతమి మాట్లాడుతూ పట్టణంలో యథేచ్ఛగా వెలుస్తున్న అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతూ మూర్తిపల్లి సర్వే నెంబరు-64లో ఎకరం పొలంలో హిందూపురం రోడ్డులో అనుమతి తీసుకోకుండా అక్రమ లేఅవుట్లు వేశారని వీటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ కాకుండా సబ్ రిజిస్ట్రర్‌కు ఫిర్యాదు చేశామని వివరించారు. కౌన్సిలర్ కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ 7వ వార్డులో వారం రోజుల నుంచి తాగునీటి సమస్య నెలకొన్నా పట్టించుకోరా అని అధికారులను నిలదీశారు. పైపులైన్‌లో సమస్య తలెత్తిందని త్వరగా పరిష్కరిస్తామని అధికారులు సమాధానం చెప్పారు. కౌన్సిలర్ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర కళాశాలకు దాత సద్దపల్లి కాశీం స్థలం ఇచ్చారని, అందులో ప్రయివేట్ వ్యక్తికి విఎల్‌టి ఎలా వేస్తారని నిలదీశారు. అన్ని డాక్యుమెంట్లు పరిశీలించాకే విఎల్‌టి వేశామని అధికారులు సమాధానం ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి : పల్లె


సమావేశంలో మాట్లాడుతున్న పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో గురువారం బూత్ లెవెల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించగా నియోజకవర్గ పరిశీలకులు బచ్చలి పుల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలను ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శుక్రవారం నుంచి మండలాల్లో ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, ఆరు మండలాల కన్వీనర్లు, నాయకులు శ్రీరామ్‌రెడ్డి, పుల్లప్ప, సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన


పౌరుల హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని దొడగట్ట గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ హాజరై మాట్లాడారు. దళితులను ఆలయ ప్రవేశం చేయనీయకపోతే కలిగే నష్టాలు, ఒకరి పేరుపై ఉన్న భూమిని మరొకరు ఆక్రమించుకుంటే వచ్చే నష్టాలను వివరిస్తూ దళితులు విద్యనభ్యసిస్తే ఇలాంటి వాటిని తొలగించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, ఎంపిడిఒ రాబర్ట్‌విల్సన్, పరిగి ఎస్ఐ నరేంద్ర, వివిధ సంఘాల నాయకులు, మాల మహానాడు మండల అధ్యక్షులు వేణుగోపాల్, రాజు, గోపాల్, పాల్గొన్నారు.

పరిగి : మండల పరిధిలోని మోద గ్రామం ఎస్సీ కాలనీలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, మట్కా నిర్వహణపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నరేంద్ర ప్రజలను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీతో పాటు సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ చెన్నకేశవులు, పలువురు పాల్గొన్నారు.

వీరచౌడేశ్వరీదేవి ఆలయానికి 'గోనుగుంట్ల' విరాళం


విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని కొత్తకాలనీలో నూతనంగా వెలసిన వీరచౌడేశ్వరీదేవి ఆలయానికి గురువారం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ రూ. 20 వేలు విరాళం అందజేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, అన్నదాన కార్యక్రమాల కోసం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు.

గాలివాన బీభత్సం.. ఆటో ధ్వంసం


పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించడంతో పెద్ద వృక్షము విరిగిపడి ఆటో ధ్వంసమైం ది. పట్టణానికి చెందిన బెస్త రవీంద్ర ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం 5 గంటల సమయంలో గాలివాన ధాటికి ఆయన ఇంటి ముందు ఉన్న పెద్ద వేప చెట్టు విరిగి పడటంతో ఆటో ధ్వంసమైంది. దీంతో బాధితుడు రవీంద్ర మాట్లాడుతూ పెద్ద ప్రమాదం తప్పిందని, అయితే ఆటో ధ్వంసం కావడంతో రూ. 20 వేలు నష్టం వాటిల్లిందని వాపోయాడు.

ఎస్ఐ నరసింహుడుకి ప్రశంసాపత్రం

బుక్కపట్నం : విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు ఎస్ఐ నరసింహుడు ఎస్పీ మాధవరెడ్డి నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈయన ప్రజలతో మమేకమై కేసులో పరిష్కారంలో తనదైన శైలిలో ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ నుంచి ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా ఉంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అవార్డు గ్రహీతను పోలీస్ సిబ్బంది అభినందించారు.

లక్ష్మీనారాయణకు నివాళి

ధర్మవరం టౌన్ : లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లడ్డు లక్ష్మీనారాయణ దాతృత్వం కలిగిన వ్యక్తి అని లయన్ క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. ఈ మేరకు గురువారం వారు లడ్డు లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ కురుబ కళ్యాణ మండపానికి రూ. 15 లక్షలు, లయన్స్ క్లబ్‌కు వ్యక్తిగతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోహన్ దాస్, ప్రతినిధులు లయన్ వెంకటస్వామి, గోసేరాధాక్రిష్ణ, మెటికల కుళ్లాయప్ప, ఉట్టి శివప్రసాద్, ముక్తాపురం క్రిష్ణ, చందా నాగరాజు, గూడూరు రాజగోపాల్, కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ కౌన్సిల్ సమావేశంలో సమస్యలు ఏకరువు


సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ అధికారులు, సభ్యులు

ప్రజాశక్తి -పెనుకొండ

నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. సమావేశానికి వైస్ ఛైర్మన్లు సునీల్ కుమార్, నందినిరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు హాజర య్యారు. ఈ సందర్భంగా అజెండాలోని 22 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని 3 అంశాలను నగర పంచాయతీ ఉద్యోగి రవి చదివి వినిపించారు. అనంతరం పలు అంశాలపై కౌన్సిలర్లు చర్చించి అజెండాను ఆమోదించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు శేషాద్రి, సుధాకర్‌రెడ్డి, సద్దాం, తయూబ్, షేక్ షాబియానా పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లపై చెత్త, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, దర్గా రోడ్డులో అక్రమ కట్టడాలు, తదితర సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సమస్యను పరిష్కరించలేదని వినూత్నంగా మున్సిపల్ ఎఇ నాగేంద్రకు పూలమాలవేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని దర్గా రోడ్డులో ఆక్రమణలను తొలగించాలని కౌన్సిల్ సమావేశం అనంతరం కౌన్సిలర్ భర్త యాసిన్ సమావేశ హాలులో నగరపంచాయితీ టిపిఒ మంజులను డిమాండ్ చేశారు. దీంతో వారి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది.

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించాలి

కొత్తచెరువు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచేలా వ్యాయామ ఉపాధ్యాయులు పని చేయాలని డిఇఒ మీనాక్షి సూచించారు. స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో గురువారం జిల్లా సెకండరీ స్కూల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించగా డిఇఒ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పిఇటిలు, పిడిలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాయామంతో పాటు క్రీడల గురించి తెలియజేసి క్రీడల పట్ల ఆసక్తి పెంచాలన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా ఉండాలన్నారు. క్రీడల్లో మెరుగైన ఫలితాలు కనబరిస్తే ఉన్నత ఉద్యోగాలు కూడా పొందవచ్చు అన్నారు. అనంతరం జిల్లా సెకండరీ స్కూల్ అసోసియేషన్ కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోనే నియోజకవర్గాల వ్యాప్తంగా విద్యార్థులకు గ్రిక్స్ టోర్నమెంటులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో డైట్ ప్రిన్సిపల్ రామకృష్ణ, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మురార్జీయాదవ్ కుమార్, రాజా, పిఇటిలు వెంకటేశు, రామకృష్ణ, భయ్యారెడ్డి, పాల్గొన్నారు

టిడిపి కరపత్రాలు పంపిణీ

ఓబుళదేవరచెరువు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించిన 'మిషన్ రాయలసీమ' మేనిఫెస్టో కరపత్రాలను గురువారం ఓబుళదేవరచెరువులో టిడిపి మండల కన్వీనర శెట్టివారి జయప్ప ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జాకీర్ అహ్మద్, మండోజి ఆరిఫ్‌ఖాన్, ప్రభాకర్‌రెడ్డి, పొగాకు షబ్బీర్, అంజనప్ప, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, సాదీ నాగరాజు, గండికోట ఇర్షాద్, చాంద్‌బాషా, బి.మాధవి, లావణ్య, సర్పంచి రేణుకాబాయి, మస్తానమ్మ, భాగ్యమ్మ, జ్యోతి, ముంతాజ్, అఖిల, వెంకటమ్మ, సాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.18 లక్షల విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాలువేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి ఎస్ఎం గొల్లహళ్లి గ్రామస్తులు రూ. 1,18,000 విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని గురువారం శ్రీలక్ష్మీరంగనాథస్వామి ధర్మ ప్రచార సేవా పరిషత్ ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గొల్లహళ్లి గ్రామ పెద్దలు రంగప్ప, సన్న రంగప్ప, శ్రీనివాస్, మధుకుమార్, కృష్ణప్ప, జిఎం తిమ్మన్న, మహేష్, అర్చకులు శ్రీకాంత్, కమిటీ నిర్వాహకులు సత్యనారాయణరెడ్డి, తిమ్మప్ప, రాజన్న, బండి రమేష్, కాంతారాజు పాల్గొన్నారు.

2న నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ సమావేశం

మడకశిర రూరల్ : పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్ ఆవరణలో సెప్టెంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

గాండ్లపెంట : సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఎంఆర్‌సి భవన్ వద్ద ఉపాధ్యాయ సంఘాలు ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ నాలుగేళ్లయినా అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఉపాధ్యాయులను పోలీసులు అడ్డుకుంటున్నారని, దీంతో సెప్టెంబరు 1వ తేదీ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, రమేష్, శ్రీనివాసులు, నాగరాజునాయక్, భారతి, దివ్య, భవ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాంకుల వితరణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని వైఎస్ ఆర్ కాలనీలో ఉన్న మంజునాథస్వామి ఆల యం, గొట్లూరులోని శివరామదీక్షితుల ఆశ్రమానికి గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వాటిని వంకదారి రామచంద్ర గుప్తా భార్య వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు నీరజాదేవి, షర్మిల, హేలసదేవి అందజే శారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, అంజన్నప్ప, కేశవరెడ్డి, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, రంగనాథ్, బండి నాగేంద్ర, రమేష్‌బాబు, జయంతి, వినోద్, పాల్గొన్నారు.

కిట్లను సక్రమంగా పంపిణీ చేయాలి

బత్తలపల్లి : టేక్ హోం రేషన్ కిట్లను సక్రమంగా అందించాలని డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి అంగన్వాడీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన తహశీల్దార్ యుగేశ్వరీదేవి, సిఎస్‌డిటి శారదలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్ కిట్లను ప్రతి నెలా 1వ తేదీ పంపిణీ చేసాలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రేషన్ కార్డుదారులకు అందుతున్న నిత్యావసర సరుకులు, తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న దీపికవేణురెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

హిందూపురం : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి సూచించారు. రూరల్ మండల పరిధిలోని మణేసముద్రంలో గురువారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. అలాగే ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ప్రణాళికతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హసీనా సుల్తానా, ఎంపిడిఓ నరేంద్రకుమార్, ఇఒఆర్‌డి నటరాజ్, హౌసింగ్ ఎఇ నారాయణరెడ్డి, ఎలక్ట్రికల్ ఎఇ మహేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ దివ్య, మధుమతిరెడ్డి, వైస్ ఎంపిపి రామంజి, సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, లలితరాము, అశ్వత్థరెడ్డి, దేవరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు రంగనాథ్, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

గోరంట్ల రూరల్ : ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చే టిడిపిని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి భార్య కమలమ్మ పిలుపునిచ్చారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ', మహాశక్తి కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె చంద్రబాబు ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్థసారథి అల్లుడు శశిభూషణ్, మండల కన్వీనర్ సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి అజంతుల్లా, నాయకులు కన్నారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, చంద్ర, జయరాం, వేణు, నరేంద్ర, మణిశేఖర్‌రెడ్డి, రామ్మోహన్, ఉమర్‌ఖాన్, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


కదిరి టౌన్ : మండల పరిధిలోని సున్నపుగుట్ట తండాకు చెందిన శ్రీదేవి అనారోగ్యంతో మృతిచెందడంతో కదిరి టిడిపి సీనియర్ నాయకులు బంగారు కృష్ణమూర్తి ఆ గ్రామం వెళ్లి శ్రీదేవి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చి దహన సంస్కారా ల నిమిత్తం రూ. 10వేలు అందజేశారు. శ్రీదేవి పిల్లలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శీనానాయక్, జయరాంనాయక్, రాజునాయక్ పాల్గొన్నారు

వాహనాల తనిఖీ

ముదిగుబ్బ : స్థానిక నాలుగు కూడళ్ల సర్కిల్, జాతీయ రహదారిపై గురువారం సిఐ యతీంద్ర వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రోడ్డుపై స్పీడ్‌గా వెళ్లదారని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. అలాగే రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలను పరిశీలించి ట్రాఫిక్ అంతరాయంపై ఆరా తీశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది గోపాల్, భాస్కర్, నారాయణస్వామి నాయక్, శీన, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : పట్టణానికి చెందిన ఉసామాఖాన్, గీతిక రెఫరీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి కుమితే జడ్జి-బి సర్టిఫికెట్‌ను సాధించడంతో గురువారం కరాటే మాస్టర్ ఫైరోజ్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే ఇండియా ఆర్గనైజేషన్, స్పోర్ట్స్ కరాటే జూడో అసోసియేషన్ ఆఫ్ ఎపి సంయుక్తంగా విశాఖపట్నంలో నిర్వహించిన కరాటే రెఫరీ పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించామ న్నా రు. అలాగే ఎపి జనరల్ సెక్రెటరీ షిహన్ కె.కీర్తన్ నుంచి రెఫరీ బ్యాడ్జ్, సర్టిఫికెట్ అందుకున్నా రన్నారు.


విద్యార్థులతో మాస్టర్ ఫైరోజ్


ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రజల సమస్యలను గుర్తించడంలో ముందుంటూ ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజాశక్తి ప్రత్యేక ముద్ర వేసుకుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం కందికుంట ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజల సమస్యల కోసం నిత్యం పరితపిస్తూ, ప్రజల పక్షాన వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు హరి, మల్లికార్జున, రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయించండి

ధర్మవరం టౌన్ : మరణానంతరం కళ్లు దానం చేయించి చూపులేని ఇద్దరికి చూపును ప్రసాదించాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ పోలా ప్రభాకర్, ధర్మవరం టౌన్ శాఖ ఛైర్మన్ డాక్టర్ నరసింహులు సూచించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని డాక్టర్ నరసింహులు నివాసంలో స్వచ్ఛంధ సేవా సంస్థలకు నేత్రదానంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే 9440 683100, 944 1184004 నెంబర్లకు సమాచారం అందిస్తే నేత్రాలు స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ పార్కు సంఘం అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గూడూరు మోహన్‌దాస్, గూడూరు రాజగోపాల్, కోశాధికారి వేణుగోపాలచార్యులు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయసింహా, నాగభూషణం, ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి గట్టు హరినాథ్, శివయ్య యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం టౌన్ : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని ఎంపిపి గిరక రమాదేవి, ఎంపిడిఒ సౌజన్యకుమారి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన ప్రగతి నివేదికలను స్వీకరించి, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని, ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. రేగాటిపల్లి సచివాలయం, ఏలుకుంట్లలో ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు ఈ నెల 10వ తేదీ లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేలకోట, మల్కాపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు అనుమతులు వచ్చాయని, వాటిని వెంటనే ప్రారంభించాలన్నారు. ఎస్సీడీసీ సర్వే 80 శాతం పూర్తయందని మిగిలిన భాగం త్వరలోనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తచెరువు : స్థానిక బుక్కపట్నం రోడ్డులో నడిమి కొండ వద్ద బుధవారం రాత్రి కెనరా బ్యాంకు అటెండర్ అనుమానాస్పద స్థితిలో చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బుక్కపట్నం మండల పరిధిలోని నార్సింపల్లి తండాకు చెందిన బొజ్జనాయక్ కుమారుడు అశోకనాయక్(36) పుట్టపర్తి కెనరా బ్యాంకులో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేసినా స్పందిం చలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం చెరువులో శవాన్ని చూసి బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందిం చారు. మృతదేహంపై తీవ్ర గాయాలు ఉండడంతో ఎవరైనా చంపి ఇక్కడ వేశారా లేదా చెరువులో పడి మృతి చెందాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగన్న తెలిపారు.

లారీని ఢీకొన్న బస్సు.. పలువురికి గాయాలు

హిందూపురం : రూరల్ మండలం తూముకుంట చెక్ పోస్ట్ సమీపంలో కర్నాటక బార్డర్ లో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద బస్సు లారీని ఢీకొన్న సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బెంగళూరు నుండి హిందూపురం మీదుగా ధర్మవరం వెళ్లే వెంకటేశ్వర ప్రయివేటు బస్సు కర్నాటక బార్డర్ లో డీజిల్ వేసుకుని బయటకు వస్తున్నా లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలాయి. బస్సు కుడివైపు నుజ్జు నుజ్జు అయింది. బస్సు లో పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని గౌరీబిదనూరు ఆసుపత్రికి తరలించారు.

'యువగళం' పాదయాత్రకు సంఘీభావంగా ర్యాలీలు


మడకశిర సంఘీభావ ర్యాలీ చేపట్టిన టిడిని శ్రేణులు

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలో సంఘీభావ ర్యాలీ చేపట్టారు. స్థానిక మెట్టబండ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీలో నియోజకవర్గ పరిశీలకులు పులివెందుల పార్థసారథిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, గురుమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కొంకల్ కృష్ణమూర్తి, విశ్రాంత ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ మల్లికార్జున, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, దాసరెడ్డి, గణేష్, గుండుమల చంద్రప్ప, పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య చౌదరి, రంగయ్య గౌడ్, దుర్గేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, తాలూకా అధ్యక్షులు జయకుమార్, రామాంజనేయులు, గోవిందప్ప, రవికుమార్, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, తిమ్మరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : యువగళం పాదయాత్ర 200 రోజులు, 2,700 కి.మీ. పూర్తయిన సందర్భంగా గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో దండమూడి విడిది కేంద్రం వద్ద నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే లోకేష్‌తో పాటు కొద్దిసేపు పాదయాత్రలో పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని కప్పలబండ గ్రామం నుంచి మామిళ్లకుంట క్రాస్ వరకూ యువగళం సంఘీభావ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం, వైసిపి నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నారా లోకేష్ వాటిని అధిగమించి సాగిస్తున్న పాదయాత్రకు భవిష్యత్తులో కూడా ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. ర్యాలీలో సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్లు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రత్నప్పచౌదరి, పుల్లప్ప, మాల మనోహర్, జయప్రకాష్, శ్రీరామిరెడ్డి, టీచర్ శివయ్య, చంద్రశేఖర్‌నాయుడు, చంద్రశేఖరప్ప, సర్పంచులు వెంకటప్ప, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీదేవి, ఓబులేసు, బత్తలపల్లి శ్రీనివాసులు, పాల్గొన్నారు.


కదిరి టౌన్ : నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చౌక్, శివాలయం, హిందూపూర్ క్రాస్, రాయలసీమ సర్కిల్ మీదుగా పూలే విగ్రహం వరకు సంఘాభావ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి తిరోగమనంలో పయనిస్తుందని విమర్శించారు. రాజకీయ పార్టీలకు ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని, ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా జగన్ పాలన చేస్తున్నారన్నారు.

పెనుకొండ : యువగళం పాదయాత్ర దిగ్విజయంగా సాగుతుండడంతో వైసిపిలో వణుకు పుడుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ సవితమ్మ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహా నికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, శ్రీరాములు, సూర్యనారాయణ, సోమశేఖర్, ఆంజనేయులు, నరసింహులు, త్రివేంద్ర, సుబ్రహ్మణ్యం, బాబుల్‌రెడ్డి, మంజునాథ్, చిన్న పోతన్న, నాగేంద్రప్ప, వీరచిన్న పాల్గొన్నారు. అలాగే యువగళం పాద యాత్ర విజయవంతం కావాలని కాంక్షిస్తూ పెనుకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు కురుబ కృష్ణమూర్తి కర్నాటకలోని చిక్కబళ్లాపూర్ వద్ద ఉన్న (ఈశా ఫౌండేషన్) పరమశివుడిని దర్శించుకుని ప్రార్థించారు.

తలుపుల : యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి వీరాభిమాని ఎద్దుల రాముడు స్థానిక బస్టాండ్‌లోని మూడు రోడ్ల కూడలి నుంచి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నానని తెలిపారు. బైకును టిడిపి జెండాలతో అలంకరించి తలుపుల పురవీధుల్లో జై టిడిపి అంటూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

బత్తలపల్లి : యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేస్తుకున్న సందర్భంగా మండల పరిధిలోని సంజీవపురం వద్ద వెలసిన కాటికోటేశ్వర స్వామి ఆలయంలో టిడిపి మండల నాయకులు అయ్యప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 200 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో కస్టర్ ఇన్‌ఛార్జి సురేంద్రనాయుడు, నెట్టెం రమణ, చల్లా శ్రీనివాసులు, అయ్యప్ప, జగ్గు, ఓబుళనాయుడు, బుజ్జి, మారుతి, శ్రీరాములు పాల్గొన్నారు.

రొద్దం : టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి ఆదేశాల మేరకు ఆయన భార్య కమలమ్మ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్దకోడిపల్లి నుంచి రొద్దం పెద్ద ఆంజనేయస్వామి ఆలయం వరకు నాయకులు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, అధికార ప్రతినిధి నరసింహులు, లీలావతమ్మ, మండల కన్వీనర్ నరహరి, నాయకులు రామకృష్ణ, చిన్నప్పయ్య, శ్రీరాములు, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, హరీష్, మురళి, నాగరాజు, రాము, హరికృష్ణ, శ్రీనివాసులు, షణ్ముఖ పాల్గొన్నారు.


పాదయాత్రలో నారా లోకేష్‌ను కలిసిన బికె పార్థసారథి